# వంచన

మా జీపు గజానన అయిల్‌మిల్ ముందు ఆగింది. నా ఆలోచనలకు బ్రేకులు పడ్డాయి. విజిలెన్స్ వాళ్ల జీపంటే మిల్లర్లకు హడల్. అందులోనూ... డ్యూటీ మైండెండ్ ఆఫీసర్లుగా పేరుబడ్డ కొందరం జీపునిండా బయల్దేరి పట్టణంలో అయిల్ మిల్స్ మీదా, రైస్ మిల్స్ మీదా డాడి చేస్తున్నమాయె. రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవ లేనట్లే మేము తలచుకుంటే మిల్లర్ల వద్ద తప్పుల కుప్పలు కనబడతాయి. ఎందుకైనా మంచిదని సమస్యల్ని సామరస్యంగా పరిష్కరిస్తుంటాం. పెనాల్టీ రూపంలో ప్రభుత్వానికి ఆదాయం చూపిస్తూ, పుణ్యంతోపాటు పురుషార్థం కూడా చూసుకుంటున్నాం.

గజానన మిల్ యజమాని ఖచ్చితమైన లెక్కలు చూపిస్తాడనీ, ఎవరి చేతులూ తడపడని విన్నాము. అందుకే కాబోలు మేము వస్తున్నామని తెలిసికూడా మిల్లు తెరిచే ఉంచాడు. పళ్లికిలిస్తూ స్వాగతం పలికలేదు-ఇతర మిల్లర్లలా. బిలబిల మంటూ లోపలికి చొచ్చుకెళ్లాం గాలివానలాగ. సరుకు ఖరీదు,

అమ్మకం లెక్కలు, పత్రాలు రిజిష్టర్లు చూస్తున్నాం-చిత్రగుప్తుడు చిట్టాలు చూస్తున్నట్టు. తప్పులేవి కనబడ్డం లేదు. కాఫీలు చప్పరిస్తూంటే మా కొలీగ్ సుదర్శన్, మా చీఫ్ కొక ఫైలు నందిస్తూ “సార్ పోయిన్నెల పదో తారీకునాడు వంద క్వింటాళ్ల పల్లిపలుకు కొన్నట్టు రిజిషర్లో రాసుంది, కాని ఇన్వాయిస్ ఫైల్లో లేదు. ఇంతకీ ఆ రోజు కొన్నది వంద క్వింటాళ్లా, వెయ్యి క్వింటాళ్లా?” అన్నాడు యజమాని ముఖంలోకి చూస్తూ.

“అదెలా సాధ్యం?, ఆ ఇన్వాయిస్‌ను నేనే స్వయంగా ఫైలు చేశానందులోనే” అంటూ యజమాని ఫైలు తీసుకుని చూసాడు అన్ని కాగితాలు రెండు మూడు సార్లు తిరగేసి మొహం తేలేశాడు. చమటలు కక్కుతున్నాడు. మా చీఫ్ కళ్లెర్ర జేసి బెదిరించాడు. విధిలేక యజమాని అర్థం, పరమార్థం ధారపోసి తప్పుకున్నాడు.

తిరిగి జీపులో వెళ్తుండగా మా చీఫ్ “మిస్టర్ సుదర్శన్! ఆ ఇన్వాయిస్ నిజంగా నే పెట్టారంటారా?” అనుమానం వ్యక్తం చేశాడు విజయగర్వంతో చిరునవ్వులు చిందిస్తూ సుదర్శన్ జేబులోంచి ఎర్రటి కాయితం తీసి చీఫ్ చేతుల్లో ఉంచాడు. అందరం దాన్నే చూశాము పరిశీలించి. అదే ఇన్వాయిస్. వంద క్వింటాళ్ల పల్లిపలుకుది-పోయిన్నెల పదో తారీకుది.

(“ఆంధ్రభూమి” - 15-6-1988.)